ఆశాజనకంగా మిర్చి సాగు

- మండలంలో 400 ఎకరాల్లో సాగు
- పెరిగిన దిగుబడులు
- ఇతర రాష్ట్రాలకు బజ్జీ మిర్చి ఎగుమతి



నాగాయితిప్పలో మిర్చిని కాటా వేస్తున్న రైతులు

నాగాయితిప్ప(మోపిదేవి): మండలంలోని పలు లంక గ్రామాల్లో వేసిన పచ్చి మిర్చి దిగుబడి ఆశాజనకంగా ఉంది. కోసూరువారిపాలెం, నాగాయితిప్ప, మోపిదేవిలంక తదితర మెట్ట ప్రాంతాల్లో కూరగాయలతో పాటు వాణిజ్య పంటలు సాగు చేస్తారు. ఈ ప్రాంతంలో పండించిన బజ్జీ మిర్చి పెద్దదిగా పెరిగి నాజూకుగా ఉంటోంది. పంటవేసిన తరువాత సుమారు మూడు నెలల పాటు మిర్చి పంట కోత కోయవచ్చు. హైబ్రిడ్ పచ్చి మిర్చి మంట తక్కువగా ఉండటంతో తెలంగాణ వాసులు కొనుగోలుకు అధిక ఆసక్తి చూపుతున్నారు. ప్రతి రోజూ వ్యాపారులు నాగాయితిప్ప, కోసూరువారిపాలెం నుంచి ఏడు లారీల మిర్చిని తెలంగాణ, జైపూర్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏ రోజు ధరను ఆరోజే రైతుకు చెల్లిస్తారు. ప్రస్తుతం రైతుకు కిలో మిర్చి రూ. 23 నుంచి 25 లోపు ధర చెల్లిస్తున్నారు. బజ్జీ మిర్చికి ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉండటంతో మధ్యవర్తులు, చిరు వ్యాపారులు రైతుల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు సుమారు రూ. 80 వేలు పెట్టుబడి అవుతోంది. 45 రోజుల తరువాత కోతకు వస్తుంది. వారానికి ఒకసారి చొప్పున సుమారు మూడు నెలల పాటు మిర్చి కోత కోయవచ్చు.

ఎమ్మార్పీకే మందులు విక్రయించాలి..



పంటపై పురుగుల దాడి ఎక్కువగా ఉన్నందున నివారణకు ఎక్స్ పోనస్ మందు పిచికారీ చేస్తున్నాం. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని షాపుల్లో బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నారు. 8.5 ఎంఎల్ ఉన్న ఎక్స్ పోనస్ డబ్బాపై ఎమ్మార్పీ రూ. 670 ఉండగా, బ్లాక్ మార్కెట్‌లో రూ. 1,500లకు అది కూడా కావలసిన వారికే విక్రయిస్తున్నారు. ప్రభుత్వం బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టి ఎమ్మార్పీకే మందులు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– బొలిముంత శ్రీనివాసరావు, రైతు, నాగాయితిప్ప

మార్కెట్ ధరలు తెలియడం లేదు



బయట మార్కెట్‌లో ఉన్న మిర్చి ధరలను వ్యాపారులు ప్రతి రోజూ రైతులకు చెప్పడం లేదు. ధర తగ్గినప్పుడే ధర లేదని చెబుతున్నారు. ధరలు పెరిగిన సమయంలో రైతులకు తెలియక పోవడంతో తక్కువ ధరకే అమ్మి నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం బయట మార్కెట్ ధరలు స్థానిక రైతులకు తెలియజేస్తే ధరలు పెరిగిన సమయంలో పంట కోసి అధిక ధరలు పొందే అవకాశం ఉంటుంది.

– ఉప్పాల వెంకటేశ్వరరావు, మోపిదేవిలంక

మిర్చి పంటకు అధిక పెట్టుబడి



మిర్చి పంటపై పురుగు ఆశిస్తోంది. దీని నివారణకు ప్రతి రెండు రోజులకు ఒకసారి పురుగుమందు పిచికారీ చేయాలి. ప్రస్తుతం మిర్చి దిగుబడి బాగుంది. మార్కెట్ ధరలు రోజుకోవిధంగా ఉంటున్నాయి. మందులపై అధికారుల పర్యవేక్షణ ఉంచి నాణ్యమైన మందులు అందించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– నారగం రాంబాబు, రైతు, మోపిదేవిలంక

సీఎం జగన్, ఎమ్మెల్యే పేర్ని నానికి ముస్లింల కృతజ్ఞతలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాజుపేట నూరుల్ ఇస్లాం మదరసాకు 227 గజాల స్థలాన్ని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంపై మదరసా కమిటీ ప్రతినిధులు, నగర ముస్లింలు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు మదరసా లో బుధవారం సమావేశమై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) లకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా మాట్లాడుతూ గజానికి రూ. 500 చొప్పున చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా ఎమ్మెల్యే పేర్ని నాని చెల్లించి మదరసాకు ఈ భూమి చెందేలా చేయడం అభినందనీయమన్నారు. గత టీడీపీ పాలకులు సర్వే నెంబరు సరిగ్గా వేయకుండా వ్యక్తుల పేరుతో పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారని, దీని వల్ల మదరసాకు ఈ భూమిపై ఎలాంటి హక్కు లేకుండా పోయిందని చెప్పారు. ఎమ్మెల్యే పేర్ని నాని ప్రత్యేక కృషితో ప్రభుత్వం ఈ భూమిని మదరసా పేరున కేటాయించిందన్నారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, మదరసా కమిటీ కార్యదర్శి మొహమ్మద్ జానీబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు షేక్ జలీల్, కార్పొరేటర్ మీర్ అస్గర్‌అలీ, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ ఇక్బాలీ, అన్వర్ హుస్సేన్, రబ్బానీ, యూనస్, మొహమ్మద్ రఫీ, షర్ఫూన్‌ఖాన్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

చల్లపల్లి: ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉయ్యూరులో విద్యుత్ వినియోగదారుల సదస్సు ఏర్పాటు చేశారని చల్లపల్లి సబ్ డివిజన్ డీఈ పులి శివ నాగేశ్వరరావు తెలిపారు. ఉయ్యూరు కేసీపీ సమీపంలోని ఉయ్యూరు సబ్ డివిజన్ సెక్షన్ కార్యాలయంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. విద్యుత్ సరఫరాలో లోపాలు, విద్యుత్ మీటర్ సమస్యలు, విద్యుత్ బిల్లులోని సమస్యలు ఉంటే ఫోరం సభ్యుల వద్దకు వచ్చి పరిష్కారం పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని చల్లపల్లి, అవనిగడ్డ సబ్ డివిజన్ల విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ అత్యవసర సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో నిర్వహిస్తామని మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కౌన్సిల్‌లో చర్చ జరుగుతుందని చెప్పారు.

నేడు పైప్‌లైన్ పనులకు భూమి పూజ

మచిలీపట్నంటౌన్: 29వ డివిజన్ చింతగుంటపాలెం పోస్టాఫీస్ పక్కనున్న రోడ్డులో తాగునీటి పైప్‌లైన్ పనులకు గురువారం భూమి పూజ చేస్తారని మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఈ పనులకు భూమిపూజ చేస్తారని చెప్పారు. కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

మండవల్లి: వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో నష్టపోతున్నారని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎస్.భాస్కరరావు, టి.అప్పారావు తెలిపారు. మండవల్లి మండలం తక్కెళ్లపాడులో ఐక్య వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కులపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమాచార హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చి 17 ఏళ్లయినా గ్రామీణ ప్రజలకు అవగాహన లేదని చెప్పారు. కార్యక్రమంలో ఐక్య వేదిక సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మినుము నూర్పిడి పనులు



ఘంటసాల మండలం చినకళ్లేపల్లిలో మినుము పంటను పట్టాలకెత్తిన రైతు

అవనిగడ్డ: వాతావరణం మారడంతో రైతులు పొలాల బాట పట్టారు. రానున్న నాలుగు రోజుల్లో వర్షాలు పడవచ్చని వాతావరణ శాఖాధికారుల హెచ్చరికతో రైతులు మినుము పంటను ఇళ్లకు చేర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. అవనిగడ్డ నియోజకవర్గంలో 56,485 ఎకరాల్లో మినుము సాగు చేశారు. ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో 85 శాతం మినుము నూర్పిళ్లు జరగ్గా, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో ఇప్పుడే మినుముతీత, నూర్పిళ్ల పనులు ఊపందుకున్నాయి. బుధవారం ఉదయం మబ్బులు పట్టడంతో మినుము నూర్పిడి చేసి ఆరబెట్టిన పంటను ఇళ్లకు చేర్చుకున్నారు. మినుము కాయ లాగి ఉన్న పంటను పట్టాలు కప్పి కాపాడుకునే పనులు చేపట్టారు. ఈ సమయంలో వర్షం పడితే మినుము కాయలు పగిలిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం మబ్బులు పట్టినా తేలిపోవడంతో ఆందోళన చెందిన రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మరో వారం రోజులు వర్షం లేకుండా ఉంటే పంట ఇంటికి చేర్చుకుని గట్టెక్కుతామని కొందరు రైతులు చెప్పారు.

నవధాన్యాల సాగుతో రైతులకు మేలు

కడవకొల్లు నరసింహారావు



మాట్లాడుతున్న జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు

అవనిగడ్డ: నవధాన్యాలు సాగుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వైఎస్సార్ రైతు విభాగం జోనల్ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవధాన్యాల సాగుపై ఐదు మండలాలకు చెందిన వ్యవసాయ సిబ్బందికి బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి కడవకొల్లు మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో భూమి సారవంతం అవుతుందని చెప్పారు. దీనివల్ల నాణ్యమైన పంటలు పండుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయం కృష్ణా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పార్థసారథి మాట్లాడుతూ నవధాన్యాల సాగువల్ల కలిగే ప్రయోజనాలు, సాగు విధానాలను వివరించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, అడిషనల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నాగమల్లేశ్వరి, జిల్లా ఐబీ కో–ఆర్డినేటర్ సాయినాథరెడ్డి, నేచురల్ ఫార్మింగ్ అసోసియేషన్ మాస్టర్ ట్రైనర్ బి. వాణి, అవనిగడ్డ మండల యూనిట్ ఇన్‌చార్జి బచ్చు శిరీష, ఐదు మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కోనేరు రంగారావు సేవలు ఎనలేనివి



కోనేరు రంగారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తాంతియాకుమారి, నాయకులు

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా కోనేరు రంగారావు అందించిన సేవలు మరువరానివని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. కోనేరు రంగారావు వర్ధంతి కార్యక్రమం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. కోనేరు రంగారావు చిత్రపటానికి ఆయన కుమార్తె, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లాం తాంతియాకుమారి, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ కోనేరు రంగారావు సేవలను కొనియాడారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొడమంచిలి చంద్రశేఖర్, పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల సుధాకరరావు, మచిలీపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎండీ దాదాసాహెబ్, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఫిరోజ్, పీసీసీ సభ్యురాలు నల్లబ్రోలు కుమారి పాల్గొన్నారు.

ఓడీఎఫ్ గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

మొవ్వ: మొవ్వ మండలంలో నూరు శాతం ఓడీఎఫ్(ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) గ్రామాలుగా గుర్తింపు పొందిన గూడపాడు, వేములమడ, నిడుమోలు గ్రామాలను బుధవారం కేంద్ర బృందం(స్వచ్ఛ భారత్ మిషన్) పరిశీలించింది. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను, చెత్త సేకరణ కేంద్రాలను, ఎలిమెంటరీ పాఠశాలలను, జిల్లా పరిషత్, పంచాయతీ కార్యాలయాల్లోని మరుగుదొడ్ల వినియోగాన్ని బృందం పరిశీలించింది. అలాగే ఆయా గ్రామాల్లో కుటుంబాలు మరుగుదొడ్లు వినియోగిస్తున్నారా.. లేదా.. అనే అంశాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. పచ్చదనం, పరిశుభ్రత, డ్రెయినేజీ వ్యవస్థ తదితర అంశాలపై, బహిరంగ మలవిసర్జన వలన వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఈఓపీఆర్డీ వీర్ల సీతారామరాజు, సర్పంచ్‌లు తాతా ఉగాది లక్ష్మి, వి.సీతారామయ్య, కొమరగిరి అంజలి, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సందర్శన



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం రోటరీ క్లబ్‌ను రోటరీ డిస్ట్రిక్ అసిస్టెంట్ గవర్నర్ ఎలక్ట్ అనీస్ బుధవారం సందర్శించారు. రోటరీ కార్యవర్గ సభ్యులతో ఆమె సమావేశమై నూతన అధ్యక్ష, కార్యదర్శుల నియామకంపై చర్చించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో సేవలు అందిస్తున్న రామలక్ష్మీ, పర్వీన్, నాగలక్ష్మీ, సత్యవతిలను ఘనంగా సత్కరించారు. నూతన అధ్యక్షుడిగా లింగం మోజెస్, కార్యదర్శిగా అనుపమ ముఖర్జీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిస్ట్రిక్ అసిస్టెంట్ గవర్నర్ జ్యోతి, రోటేరియన్లు ధన్వంతరీఆచార్య, సాయిప్రసాద్, శ్రీరామచంద్రమూర్తి, అమ్మాజీ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



పెడన విజయానంద జూనియర్ కళాశాలలో పరీక్ష గదుల నంబర్లను చూసుకుంటున్న విద్యార్థినులు

పెడన: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పెడనలో ఏర్పాటు చేసిన శ్రీ విజయానంద జూనియర్ కళాశాలలో మొదటి రోజున 332 మందికి గాను 316 మంది పరీక్షలు రాశారు. 16 మంది గైర్హాజరయ్యారని పరీక్షల అధికారులు సీఎస్, డీఓలు రమణరావు, మున్వర్ తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టిస్ జరగలేదని చెప్పారు.

అవనిగడ్డలో 28 మంది గైర్హాజరు

అవనిగడ్డ: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. అవనిగడ్డలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో రెండు చోట్ల పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 798 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 770 మంది హాజరుకాగా, 28 మంది గైర్హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 485 మంది విద్యార్థులకు గాను, సంస్కృతం, హిందీ, తెలుగు పరీక్షలకు 457 మంది విద్యార్థులు హాజరు కాగా, ఒకేషనల్ సబ్జెక్టుకు 11 మంది హాజరయ్యారు. స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో మొత్తం 305 మంది విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరయ్యారు. సంస్కృతం, హిందీ, తెలుగు సబ్జెక్టులకు సంబంధించి 302 మంది హాజరయ్యారు.

- **చల్లపల్లి:** ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక విజయ జూనియర్ కళాశాల, విజయ క్రాంతి జూనియర్ కళాశాలల్లో 585 మంది విద్యార్థులు తొలి రోజు తెలుగు, సంస్కృతం పరీక్షలకు హాజరయ్యారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పికెటింగ్, పురిటిగడ్డ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు.

ప్రొటెక్షన్ వాల్ లాకుకు మరమ్మతులు

- పెడన రామరాజు చానల్ వద్ద పాతది తీసి కొత్తది ఏర్పాటు
- ఐదువేల ఎకరాలకు పైగా సాగునీరు



ప్రొటెక్షన్ వాల్ లాకుకు జరుగుతున్న మరమ్మతు పనులు

పెడన: మంగినపూడి చానల్‌కు ప్రొటెక్షన్ వాల్ మరమ్మతు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పనులు పూర్తయితే సుమారు ఐదు వేల ఎకరాలకు పైగా సాగునీరు అందుతుంది. పెడనలోని రామరాజు చానల్ నుంచి మంగినపూడి చానల్ గతంలో ఏర్పాటు చేశారు. మంగినపూడి చానల్‌కు సాగునీరు పంపిణీ విషయంలో ప్రొటెక్షన్ వాల్ దెబ్బతినడంతో పాటు లాకు సరిగ్గా తెరుచుకునే పరిస్థితి లేక సాగునీరు సమయ పాలన లేకుండా సరఫరా అవుతోంది. మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) దృష్టికి ఈ విషయాన్ని మంగినపూడి చానల్ కింద ఉన్న రైతులు తీసుకువెళ్లడంతో సమస్యను తక్షణం పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేయడంతో పనులు ప్రారంభించారు. సుమారు రూ. 20 లక్షలతో రామరాజు చానల్ నుంచి మంగినపూడి చానల్ ప్రారంభం వద్ద ప్రొటెక్షన్ వాల్ , లాకు మరమ్మతు పనులు చేస్తున్నారు. మంగినపూడి చానల్ కింద సుమారు 3,300 ఎకరాలు, మంగినపూడి చానల్‌కు పోతిరెడ్డిపాడు, గోపువానిపాలెం బ్రాంచ్ చానల్స్ కూడా ఉన్నాయి. ఈ రెండు చానల్స్ కింద సుమారు రెండు వేల ఎకరాలకుపైగా సాగునీరు అందించాల్సి ఉంది. ఈ ప్రొటెక్షన్ వాల్ లాకు మరమ్మతులతో సాగునీరు సమయానికి రైతులకు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని ఇరిగేషన్ ఏఈఈ కె. సత్యనారాయణ తెలిపారు. పాతదాని వల్ల సాగునీరు సక్రమంగా పారుదల ఉండేది కాదని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారన్నారు. ప్రస్తుతం ప్రొటెక్షన్ వాల్ లాకు మరమ్మతులు చేయడంతో రైతులకు మేలు కలుగుతుందని ఆయన స్పష్టం చేశారు. సాగునీరు విడుదలయ్యే నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

చిట్టి పిల్లారయ్య స్వామికి ప్రత్యేక పూజలు



శంకర భారతి మహాస్వామి నుంచి ఆశీర్వచనం అందుకుంటున్న పేర్ని జయసుధ, కిట్టు



ప్రవచనం చేస్తున్న గరికపాటి

ఆలయాన్ని సందర్శించిన శంకర భారతి మహాస్వామి

మచిలీపట్నంటౌన్: బుట్టాయిపేటలోని చిట్టిపిల్లారయ్య స్వామి ఆలయంలో శతచండీ సహిత మహారుద్ర యాగం అష్టమ వార్షికోత్సవాలు నాలుగోరోజు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, సుదర్శన నారసింహహోమం నిర్వహించారు. మహారుద్ర యాగాన్ని జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతి మదభినవోద్దండ విద్యా శంకర భారతి మహాస్వామి పర్యవేక్షించారు. తొలుత ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు స్వామీజీ అనుగ్రహభాషణం చేసి ఆశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సతీమణి జయసుధ, కుమారుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) హాజరై స్వామి వారి ఆశీర్వచనాలు పొందారు. రాత్రికి మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావు మూకపంచశతి అంశంపై ప్రవచనం చేశారు. ఈ ప్రవచనాన్ని భక్తులు ఆసాంతం భక్తి శ్రద్ధలతో విన్నారు.

యుద్ధప్రాతిపదికన సర్వే రాళ్లు ఏర్పాటు చేయాలి

ఉయ్యూరు ఆర్డీఓ విజయ్‌కుమార్

పామర్రు: రీ సర్వే పనులు పూర్తి అయిన గ్రామాల్లో సర్వే రాళ్లను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయించాలని ఉయ్యూరు ఆర్డీఓ ఎస్.విజయ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్లు, వీఆర్వోలు, రెవెన్యూ అధికారులతో రీ సర్వేపై బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. 120 ఏళ్ల నాటి సర్వే రికార్డుల ఆధారంగానే ఇప్పటికీ పనులు జరగడంతో ఎన్నో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని గుర్తించిన ప్రభుత్వం భూ సర్వేలను చేపట్టిందన్నారు. భూ రికార్డులు, హక్కుల విషయాల్లో చోటుచేసుకుంటున్న అవకతవకలకు చెక్ పెట్టేందుకు రాష్ట్రంలో సమగ్ర భూ సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. అత్యాధునిక టెక్నాలజీ సహాయంతో ఈ సమగ్ర భూముల సర్వే జరుగుతుందన్నారు. 100 శాతం కచ్చితత్వంతో రాష్ట్ర వ్యాప్తంగా భూముల సర్వే చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.

పటిష్ట ఏర్పాట్లతో సర్వే పనులు

భూముల రీ సర్వే కోసం అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోందని ఆర్డీఓ విజయ్‌కుమార్ చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ, సర్వే సెటిల్‌మెంట్ విభాగాల అధికారులు సర్వే సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఆధునిక సర్వే యంత్రాలతో సర్వే చేపడుతున్నామన్నారు. ప్రతి గ్రామానికి ఇద్దరు సర్వేయర్లు, వీఆర్వోతో బృందం ఏర్పాటు చేసి సర్వేలు నిర్వహించామని చెప్పారు. ఈ సర్వే సజావుగా సాగేందుకు తొలుత భూ రికార్డుల స్వచ్ఛీకరణ వీఆర్వో బృందంతో చేపట్టామన్నారు. డీజీపీఎస్, ఈటీఎస్, డ్రోన్ సర్వే ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కార్యక్రమం నిర్వహించామన్నారు.

9 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

తొలుత రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను ప్రక్షాళన చేశామని ఆర్డీఓ తెలిపారు. దాని ప్రకారం సర్వే నిర్వహించి రైతుల భూముల సరిహద్దులను నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు ఉన్న సర్వే నంబర్ల స్థానంలో లాండ్ పార్శిల్ నంబరు వస్తుందన్నారు. అలాగే 14 అంకెలతో కూడి గుర్తింపు కార్డును భూమికి ఇచ్చామని చెప్పారు.

క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సమావేశం

పెడన: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ రాజులపాటి వాణి అధ్యక్షతన జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ డి. సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని, సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

ఢిల్లీ సుబ్బారావుకు ఘన నివాళి



బొబ్బర్లంక(మోపిదేవి): రాష్ట్రపతి భవన్ విశ్రాంత ఎస్ఐ అన్నవరపు సుబ్బారావు అలియాస్ ఢిల్లీ సుబ్బారావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం బొబ్బర్లంక గ్రామంలో బుధవారం నిర్వహించారు. విశ్రాంత డెప్యూటీ కలెక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ఆయన చేపట్టిన కార్యక్రమాలు ఆదర్శనీయమన్నారు. సుబ్బారావు అందించిన సేవలను కొనియాడారు. విశ్రాంత ఉద్యోగులు ఈఓపీఆర్డీ సీతారామరాజు, పెరికే భిక్షం, లింగం రాజేంద్రప్రసాద్, లింగం రాధాకృష్ణ, లింగం శివరామకృష్ణ, చాట్రగడ్డ రాజేంద్రప్రసాద్, లింగం బాబూరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



కోడూరు: స్థానిక కోడూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు మజ్జిగను అందించారు. వేసవి నేపథ్యంలో దాతల సహకారంతో విద్యార్థులకు ప్రతి రోజూ మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. బుధవారం కోడూరుకు చెందిన షేరింగ్ అండ్ కేరింగ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల సహకారంతో 320 మంది విద్యార్థులకు మజ్జిగను అందించారు. సభ్యులు అద్దంకి కృష్ణ, పూషడపు శివ, చామర్తి సాయి, అద్దేపల్లి ఆదిత్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



మచిలీపట్నంటౌన్: 36వ డివిజన్ రాజుపేటలో నూతన తాగునీటి పైప్‌లైన్ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆంధ్ర జాతీయ కళాశాల సమీపంలో ఎస్.ఎన్.గొల్లపాలెం రోడ్డు నుంచి నూతన కాలనీకి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు డివిజన్లలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 20 లక్షలతో ఈ పనులకు కొద్ది నెలల కిందట ఎమ్మెల్యే పేర్ని నాని శంకుస్థాపన చేశారు. పైప్‌లైన్ ఏర్పాటు కోసం ఐదు అడుగుల మేర తవ్వకాలు జరిపితే ఊటనీరు రావడంతో అప్పట్లో ఈ పనులను నిలుపుచేసి బుధవారం చేపట్టారు. పనులను కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, ఏఈ సతీష్‌చంద్ర, ఫిట్టర్ సాయి తదితరులు పర్యవేక్షించారు.

కోలాటంలో శిక్షణ



గూడూరు: కళారంగానికి నిలయమైన కప్పలదొడ్డిలో కోలాటం, భజన, నృత్య ప్రదర్శనల్లో యువతీ యువకులకు శిక్షణ ఇస్తున్నామని సాంస్కృతిక శిక్షకులు పేరిశెట్టి ఉమాకాంతం తెలిపారు. కప్పలదొడ్డి గ్రామంలో కళారంగంపై ఆసక్తి ఉన్న యువతీ, యువకులను ఎంపిక చేసి కోలాటం, భజన యూనిట్‌కు డ్రెస్ కోడ్‌ను, కాలి గజ్జెలను దాతల సహకారంతో సమకూర్చుతున్నామని చెప్పారు. బుధవారం నిర్వహించిన మొదటి ప్రదర్శనలో దాతలు హేమనందం, మేడక మధు, గ్రామస్తులు గుత్తి నేతాజీ, ఉక్కెం వీరయ్య, కొలుకుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

మండవల్లి: మండలంలోని శింగనపూడిలో ఉపాధి హామీ పథకం నిధులతో పంట కాలువ తవ్వకం పనులు బుధవారం చేపట్టారు. ఎంటీఏ నవీన్ మాట్లాడుతూ రూ.1.50 లక్షల నిధులతో పంట కాలువ తవ్వకం పనులు నిర్వహిస్తున్నామన్నారు. 56 మంది కూలీలు పనులు చేశారని చెప్పారు. ఉపాధి పనుల ద్వారా రైతుల పంట కాలువలు అభివృద్ధి చెంది సాగునీటి సమస్యలు పరిష్కారమతున్నాయన్నారు. చెరువులను అభివృద్ధి చేయడం ద్వారా పశువులకు తాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.